
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 8 । డిసెంబర్ । 2024

ప్రకృతి అందాలకు పరవశం

ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగిలో ప్రకృతి అందాలకు పర్యాటకులు పరవశించిపోయారు. తుపాను కారణంగా కొద్దిరోజులుగా మంచు కురువడం లేదు. దీని ప్రభావం తగ్గడంతో శనివారం తెల్లవారుజామున వంజంగి హిల్స్‌లో మేఘ సౌందర్యం కనువిందు చేసింది. భారీగా తరలివచ్చిన పర్యాటకులు ప్రకృతి దృశ్యాలను తిలకించారు. – సాక్షి, పాడేరు



న్యూస్‌రీల్

కాఫీ ఏడీ అశోక్ గుండెపోటుతో మృతి



పాడేరు : స్థానిక ఐటీడీఏ హార్టికల్చర్ అఫీసర్ (కాఫీ సహాయ సంచాలకుడు)గా విధులు నిర్వహిస్తున్న ఎస్. అశోక్ శనివారం మృతి చెందారు. గత నాలుగు రోజులుగా గుండె నొప్పితో బాధపడుతున్న ఆయన విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ఐటీడీఏ ఏపీవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రావు, ఐటీడీఏ ఏవో హేమలత, కాఫీ ఏఈవో అప్పలనాయుడు తదితరులు ఆకాంక్షించారు. ఆయన కుటుంబానికి వారు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి

- అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అయ్యప్పస్వామి ఆలయానికి పాల కావడితో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

సీలేరు: పలు ఆలయాల్లో సుబ్రహ్మణ్య షష్టిని శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మన్యం శబరిమలగా పేరుగాంచిన సీలేరు అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారి ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సీలేరు పురవీధుల్లో ఆలయ అర్చకుడు దామోదరం ఆధ్వర్యంలో పాలకావిడలను మోసుకుని భక్తులు ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

గగన విహారం

- అరకు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు
- పద్మాపురం ఉద్యానవనంలోని హాట్ ఎయిర్ బెలూన్‌కు మంచి ఆదరణ



పద్మాపురం ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన హాట్ ఎయిర్ బెలూన్



అరకులోయ టౌన్: మెలికలు తిరిగే ఘాట్ రోడ్లు, ఎటుచూసినా ఎత్తయిన కొండలు, పచ్చని చెట్లు, రంగురంగుల పూల మొక్కలు. మంచు దుప్పట్లో ప్రకృతి అందాలు. ఇలా భూతల స్వర్గాన్ని తలపించే అరకు అందాలను ఆకాశవీధిలోంచి వీక్షించేందుకు పాడేరు ఐటీడీఏ హాట్ ఎయిర్ బెలూన్‌ను అందుబాటులోకి తెచ్చింది. అరకు పద్మాపురం ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన దీనిపై విహరించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. పది నిమిషాలు ఆకాశంలో విహరించేందుకు ఒకొక్కరి నుంచి రూ. 1500 వసూలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 244 మంది విహరించగా 3.66 లక్షల ఆదాయం వచ్చింది. దీనిని పాడేరు ఐటీడీఏ, ఈగల్ ఫ్లై కంపెనీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఇక్కడ రెండు హాట్ ఎయిర్ బెలూన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు అందుబాటులో ఉంటుంది. పారామెటార్లను కూడా కంపెనీ ప్రతినిధులు సిద్ధం చేశారు. ఇందుకుగాను గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇది కూడా త్వరలోనే అందుబాటులోకి రానుంది. పాడేరు ప్రాంతానికి చెందిన కొంతమంది నిరుద్యోగులు ఢిల్లీలోని గురుగామ్‌లో హాట్ ఎయిర్ బెలూన్, పారా మోటార్ ఫ్లయింగ్‌లో శిక్షణ పొందారు. వీరంతా ఇక్కడ ఉపాధి పొందుతున్నారు.

చేయి చేయి కలిపి.. నిధులు సమకూర్చి..

- బొండ్రుగూడ పాఠశాలలో అదనపు భవన నిర్మాణం
- రూ. 3 లక్షల సొంత సొమ్ము వెచ్చించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు
- వసతి సమస్య పరిష్కారం
- పలువురి అభినందన



బొండ్రుగూడ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులతో ఎంపీడీవో, ఎంఈవో తదితర అధికారులు

ముంచంగిపుట్టు: సుమారు వంద మందికి పైగా విద్యార్థులు.. వీరికి ఉన్నవి రెండే గదులు.. చదువుకునేందుకు ప్రతిరోజూ ఇబ్బందులు.. ఈ సమస్యను గుర్తించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అదనపు నిర్మాణానికి సంకల్పించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ బొండ్రుగూడ మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా భవన వసతి లేదు. అదనపు భవన నిర్మాణానికి గాను విద్యార్థుల తల్లిదండ్రులు రూ.73 వేలు, పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.సురేష్‌బాబు రూ.2 లక్షలు, మిగతా ఉపాధ్యాయులు రూ.27 వేలతో కలిపి రూ.3 లక్షల సొంత నిధులను సమకూర్చారు. వీటితో పాఠశాల అదనపు భవనాన్ని నిర్మించి వసతి సమస్య పరిష్కరించారు. శనివారం ఈ భవనాన్ని ఎంపీడీవో శ్రీసాయిహర్ష, ఎంఈవో కృష్ణమూర్తి, సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ కమల విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ప్రారంభించారు. ఐకమత్యంగా నిధులు సమకూర్చిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఎంపీడీవో అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజుపడాల్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, ఉపాధ్యాయులు, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.



అదనపు తరగతి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో శ్రీసాయిహర్ష, ఎంఈవో కృష్ణమూర్తి

విద్యుత్ ఉచ్చుకు మూగజీవాల బలి

- ప్రాణాలు కోల్పోయిన ఆరు ఆవులు, రెండు గిత్తలు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- ఇద్దరు వేటగాళ్లను అదుపులోకి తీసుకుని విచారణ



సంఘటన స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని పాపంపేట సెక్షన్, దొరమామిడి బీటు అటవీప్రాంతంలో అడవి జంతువుల కోసం వేటగాళ్లు ఏర్పాటుచేసిన విద్యుత్ ఉచ్చు మూగజీవాలను బలిగొంది. మేతకు వెళ్లిన అడ్డతీగల మండలం అనిగేరుకు చెందిన రైతు ముర్ల ప్రసాద్‌కు చెందిన ఆరు ఆవులు, రెండు గిత్తలు విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని శుక్రవారం మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న అడ్డతీగల పోలీసులు, రాజవొమ్మంగి అటవీ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు వేటగాళ్లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వన్య ప్రాణుల వేట చట్టరీత్యా నేరమని, వాటిని వేటాడేందుకు విద్యుత్ కంచెలు ఉపయోగించవద్దని పోలీసులు, అటవీశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ వేటగాళ్లు ఏమాత్రం తగ్గడం లేదు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న గిరిజన యువత

మోతుగూడెం: డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగంపాడు వారపు సంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. వారోత్సవాల నేపథ్యంలో వారికి వ్యతిరేకంగా మావోయిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా శనివారం ఆదివాసీ యువజన సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో యువకులు ర్యాలీ నిర్వహించారు.

పిల్లలను ఉన్నత లక్ష్యంతో చదివించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్
- విద్యార్థుల తల్లిదండ్రులకు సూచన



డొనూరులో టగ్ ఆఫ్ వార్‌లో తాడును లాగుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కొయ్యూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యం దిశగా చదివేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం మండలంలోని డొనూరు ఆశ్రమపాఠశాలలో జరిగిన పేరెంట్ టీచర్ సమావేశం (పీటీఎం)లో ఆయన పాల్గొన్నారు. ఇప్పటినుంచి విద్యార్థులు పట్టుదలతో ఇష్టంగా చదవాలని కోరారు. పది తరువాత త్వరితగతిన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందేలా మార్గదర్శి కార్యక్రమం ద్వారా అనేక రకాల కోర్సులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌తో పాటు ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంచే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థి మధ్యలో ఇంటికి వస్తే కారణాలు తెలుసుకుని వెంటనే బడికి పంపించాలని సూచించారు. గురువుల బాధ్యత ఎంత ఉందో తల్లిదండ్రుల బాధ్యత కూడా అంతే ఉంటుందని గుర్తించుకోవాలని సూచించారు. పీవీటీజీ విద్యార్థుల బోధనకు సంబంధించి భాషా వలంటీర్లను నియమించలని కలెక్టర్‌ను జెడ్పీటీసీ వారా నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్ కోరారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని డీఈవో బ్రహ్మాజీరావును ఆదేశించినట్టు జెడ్పీటీసీ తెలిపారు.



డొనూరులో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాఠశాలకు ఆటస్థలం సమకూర్చాలని హెచ్‌ఎం ప్రభుదాస్ విన్నపం మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, తహసీల్దార్ ప్రసాద్,జేఈ రామకృష్ణ, ఎంపీడీవో ప్రసాద్ పాల్గొన్నారు.

2,913 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహణ

సాక్షి,పాడేరు: జిల్లాలోని 2,913 ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన, విద్యాభివృద్ధి అంశాలపై చర్చించారు. కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

చింతూరు: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. స్థానిక కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నర్సింహాపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో జరిగిన పేరెంట్, టీచర్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలకు అనుగుణంగా చదువుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఆయన క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ మాట్లాడారు. స్థానిక ఏకలవ్య పాఠశాలలో జరిగిన సమావేశంలో విద్యా కమిటీ చైర్మన్ జల్లి నరేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ దలీప్ సింగ్, ఎంఈవో వెంకటేశ్వర్లు, కేజీబీవీ ప్రిన్సిపాల్ రమాదేవి, హెచ్‌ఎం బాలకృష్ణ పాల్గొన్నారు.



చింతూరు కేజీబీవీలో బహుమతులు అందజేస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి: రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: పిల్లల చదువులు, పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ టీచర్ల సమావేశంలో ట్రైనీ కలెక్టర్ భావన, డీఎస్పీ సాయి ప్రశాంత్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రంపచోడవరంలోని జూనియర్ కళాశాల మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో డబ్బులు ఎరచూపి యువత, యువకులను మోసం చేస్తున్నారని, అటువంటి మోసాలకు గురి కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సురేందర్‌సింగ్, వైస్ చైర్మన్ స్రవంతి, హెచ్‌ఎం పద్మావతి, సీఐ రవి కుమార్, ఎస్‌ఐ షరీఫ్, పీడీ భవాని పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం: జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: పిల్లల చదువుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల1,2ల్లో శనివారం జరిగిన పేరెంట్, టీచర్ సమావేశాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆమెను ఉపాధ్యాయులు సత్కరించారు.



మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

సిలబస్ పూర్తికాకుండా పరీక్షలు ఎలా రాస్తారు?

- కోతులగుట్టలో విద్యార్థినుల తల్లిదండ్రుల నిరసన
- పేరెంట్స్, టీచర్ల సమావేశానికి వెళ్లకుండా రోడ్డుపై బైఠాయింపు
- సబ్జెక్ట్ టీచర్ల సమస్య పరిష్కరిస్తామని ఏటీడబ్ల్యూవో హామీతో విరమణ

కూనవరం: సబ్జెక్ట్ టీచర్లు లేకుండా, సిలబస్ పూర్తి కాకుండా తమ పిల్లలు ఎలా పరీక్షలు రాస్తారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించిన నిరసన తెలిపారు. స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ గురుకుల పాఠశాల (కోతులగుట్టలో)లో పేరెంట్స్, టీచర్ల సమావేశాన్ని వారు బహిష్కరించారు. ఈ విషయం తెలుసుకున్న ఏటీడబ్ల్యూవో సుజాత ఆగమేఘాల మీద ఏపీఆర్ గురుకులం పాఠశాలకు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఇప్పటికే ఏడుగురు ఉపాధ్యాయులను వారం రోజుల క్రితమే డిప్యుటేషన్‌పై నియమించామని ఆమె వివరించారు. సోమవారం నాటికి తప్పనిసరిగా రప్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. రాకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోమ, మంగళవారం లోపు ఉపాధ్యాయులు రాకుంటే మళ్లీ ఆందోళన చేస్తామని తల్లిదండ్రులు హెచ్చరించారు. అనంతరం సమావేశంలో విద్యార్థినుల ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ పాయం రాజు, మాజీ చైర్మన్ కారం దారయ్య, సోడె వీర బాబు, భద్రం తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

విలువిద్యలో అరకు విద్యార్థి ప్రతిభ



విద్యార్థి దేశాయ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

- జాతీయస్థాయికి ఎంపికైన దేశాయ్

అరకులోయ టౌన్: విశాఖ ఏయూలో జరిగిన అంతర్ కళాశాలల విలువిద్య పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.దేశాయ్ ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుష్పరాజ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కొండబాబు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నాగబాబు, పీడీ ఎస్. అప్పారావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు వై. విజయలక్ష్మి, మొష్యా అనిత కుమారి అభినందించారు.

సుందరీకరణ పనుల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని శనివారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న సుందరీకరణ పనులను ఆయన వ్యూపాయింట్ నుంచి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

'కొత్తపల్లి'కి పర్యాటకుల తాకిడి



కొత్తపల్లి జలపాతానికి తరలివచ్చిన పర్యాటకులు

జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతం సందర్శనకు శనివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక వాహనాల్లో రావడంతో సందడి నెలకొంది. రోజంతా జలపాతంలో స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని సందడి చేశారు.



అరకులోయలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హిమగిరి



రంపచోడవరంలో అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్



కూనవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లతాశ్రీ

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

అరకులోయటౌన్/జి.మాడుగుల/సీలేరు/రంపచోడవరం/మారేడుమిల్లి/ఎటపాక/రాజవొమ్మంగి/కూనవరం: జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలలు, పాఠశాలల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో సీఐలు, ఎస్ఐలు, అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఇస్తున్న సూచనలు ఆచరించి, సన్మార్గంలో నడవాలని హితవుపలికారు. మాదకద్రవ్యాల వ్యసనానికి అలవాటు పడితే జీవితాలతో పాటు కుటుంబాలపై తీవ్ర పరిణామాలును చూపిస్తుందన్నారు. డ్రగ్స్ మత్తులో జరుగుతున్న అఘాయిత్యాలను వివరించారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్ నిర్మూలన వాల్ పోస్టర్లును ఆవిష్కరించారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లమని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

తరలివచ్చిన అధికారులు

అరకులోయలో జరిగిన కార్యక్రమంలో సీఐ ఎల్. హిమగిరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. జి.మాడుగులలో ఎస్ఐ షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు. సీలేరులో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డి.శ్రీనివాస్ , ప్రిన్స్‌పాల్ శంకరరావు, ఎస్ఐ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. రంపచోడవరంలో జరిగిన కార్యక్రమంలో సీఐ ఆర్.జె.రవికుమార్, ఎస్ఐ సాదిక్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ తదితరులు పాల్గొన్నారు. మారేడుమిల్లిలో జరిగిన కార్యక్రమంలో సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐలు రాముల, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎటపాకలో జరిగిన కార్యక్రమంలో సీఐ కన్నపరాజు, ఎస్ఐ కె. పార్థసారధి తదితరులు పాల్గొన్నారు. రాజవొమ్మంగిలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు. కూనవరంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ లతశ్రీ , తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.ఆర్.విజయ, ఏపీటీడబ్ల్యూఆర్ ప్రిన్సిపాల్, విద్యాకమిటీ చైర్మన్ రాజు, దారయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి ఏపీ గురుకుల కళాశాలలో జరిగిన కార్యక్రమంలో చింతపల్లి డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్ స్థానిక విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు బాగా చదివి, ఉన్నతులుగా ఎదిగి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సీఐ వినోద్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వరవు, ప్రిన్సిపాల్ రామేశ్వరం, అధ్యాపకులు పాల్గొన్నారు.



జి.మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



క్రీడాకారులతో మాట్లాడుతున్న చింతపల్లి డీఎస్పీ షేక్ షెహబాజ్ అహ్మద్



సీలేరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



జడ్డంగిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చిన్నబాబు



ఎటపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



మారేడుమిల్లిలో మాట్లాడుతున్న సీఐ గోపాలకృష్ణ

వ్యసనాలకు దూరంగా ఉండాలి

- విద్యార్థులకు ఎస్పీ అమిత్ బర్దర్ సూచన
- డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోస్టర్ల ఆవిష్కరణ



డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అమిత్‌బర్దర్, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఎస్పీ ప్రమోద్

పాడేరు : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రాథమి విద్య దశ నుంచి మంచి నడవడికను అలవర్చుకుని ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. పట్టణంలోని లోచలిపుట్టు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం మెగా పెరెంట్స్ మీట్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. నిషేధిత గంజాయి జోలికి ఎవ్వరు వెళ్లవద్దని ఆయన సూచించారు. గంజాయి సాగు, రవాణా, తదితర వాటిలో ప్రమేయం ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ పూర్తిగా ఆగిపోతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు సాధించాలేరన్నారు. భవిష్యత్తు పూర్తిగా అంధకారంలో చిక్కుకొని నాశనం అవుతుందన్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాలు, ధూమపానం జోలికి వెళ్లవద్దని అవగాహన కల్పించారు. అనంతరం ఆయన ఐటీడీఏ పీవో అభిషేక్, డీఎస్పీ ప్రమోద్తదితరులతో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ముద్రించిన వాల్ పోస్టర్లు, స్టిక్కర్లను విడుదల చేశారు. విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, పాఠశాల హెచ్ఎం ప్రసాద్, పాడేరు సీఐ ధీనబంధు, తదితరులు పాల్గొన్నారు.



చింతూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

జీవితాలను నాశనం చేసుకోవద్దు

చింతూరు: విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా సూచించారు. పేరెంట్స్ కమిటీ సమావేశంలో భాగంగా స్థానిక గురుకుల పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలు కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపెడుతాయని, శారీరక, మానసిక రోగాలకు దారి తీస్తుందని ఆయన హితవు పలికారు. మంచిగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నిర్మూలన పోస్టర్‌ను ఆయన అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

734 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు అరెస్టు..రిమాండ్‌కు తరలింపు
- పాడేరులో వివరాలు వెల్లడించిన ఎస్పీ అమిత్ బర్దర్

పాడేరు /ముంచంగిపుట్టు : ముంచంగిపుట్టు మండలం లబ్బూరు జంక్షన్ వద్ద 734 కిలోల గంజాయిను పట్టుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. శనివారం సాయంత్రం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా మూలపుట్టు గ్రామం నుంచి ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ముంచంగిపుట్టు మండలం లబ్బూరు జంక్షన్ మీదుగా కొరాపుట్ ప్రాంతానికి గంజాయిని తరలిస్తున్నారని చెప్పారు. ముంచంగిపుట్టు పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో గంజాయి పట్టుబడిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా గంజాయి సాగు దాదాపుగా నిర్మూలించామని చెప్పారు. ఎవరైనా గంజాయి కేసుల్లో ప్రమేయం ఉంటే వారిపై కేసులు నమోదు చేసి వారి ఆస్తులను కూడా జప్తు చేస్తామని హెచ్చరించారు. గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా ప్రభుత్వ పథకాలను నిలుపుదల చేస్తామని చెప్పారు. సమావేశంలో పాడేరు డీఎస్పీ కె. ప్రమోద్, జి.మాడుగుల సీఐ పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ల ఆస్తులు జప్తు చేస్తాం..

లబ్బూరు జంక్షన్ వద్ద బొలెరో వాహనంలో 24 బస్తాల్లో గుర్తించిన గంజాయి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని ముంచంగిపుట్టులో ఎస్ఐ రామకృష్ణ విలేకరులకు తెలిపారు. నిందితులు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా ఆంద్రపల్లి పంచాయతీ తెంటులి పదార్ గ్రామానికి చెందిన పాంగి బ్రిసు, పనసపుట్టు పంచాయతీ సింగోయి గ్రామానికి చెందిన కిముడు ప్రపుల, మండలంలోని బుంగాపుట్టు పంచాయతీ కేంద్రానికి చెందిన గర్రం ఓరిలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. బొలెరో వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరితో పాటు ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా పనసపుట్టు పంచాయతీ ములపుట్టు గ్రామానికి చెందిన పాంగి రఘునాథ్, ఖిల్లో తిరుపతి, కొర్రా రాజుబోలతో పాటు అల్లూరి జిల్లా పెదబయలు మండలం జామిగూడ పంచాయతీకి చెందిన మఠం భగవాన్ అనే నలుగురు కలిసి గంజాయిని ఒడిశాలోని కొర్రాపుట్టు జిల్లా పాడువ బ్లాక్‌లోని డియోపోట్టంగి, పుకలి గ్రామాల్లో సుజిత్ బక్స అనే వ్యక్తికి అప్పగించనున్నట్టు విచారణలో తెలిసిందని, వారి ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏఎస్ఐ లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



లబ్బూరు జంక్షన్ వద్ద పట్టుకున్న గంజాయి, నిందితులతో ఎస్ఐ రామకృష్ణ, పోలీసులు

సమన్వయంతో పనిచేస్తే పాఠశాలల అభివృద్ధి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

పెదబయలు: అందరూ సమన్వయంతో బాధ్యతగా పని చేస్తే విద్యార్థులకు మంచి విద్యను అందించడం జరుగుతుందని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. పెదబయలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లితండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులతో పాటుగా తల్లితండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. తల్లిదండ్రులు కేవలం సెలవుల్లో మాత్రమే విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లాలన్నారు, పాఠశాలల అభివృద్ధి అందరి బాధ్యతన్నారు. విద్యార్థులు చదువుపై ఆశక్తి చూపాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల అభివృద్ధికి నాడు– నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖల మార్పుతో నాణ్యమైన విద్య అందించి విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, తహసీల్దార్ రంగారావు, ఎంఈవో కృష్ణమూర్తి, పుష్ప జోసెప్. సర్పంచ్ మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు. హెచ్ఎం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

12న ఆర్ఐటీఐలో మినీ జాబ్‌మేళా

అరకులోయ టౌన్: స్థానిక ఆర్ఐటీఐలో ఈనెల 12న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ పి. రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో రుద్ర కోఆపరేటివ్ సర్వీసెస్, మెహన్ స్వీఇంటిక్, పేటీఎం, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు పాల్గొంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాకు చెందిన 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండి, టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపై చదువులు చదివిన యువతీ యువకులు ఈ మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. పాన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని ఆమె కోరారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి నెలకు రూ. 10వేల నుంచి రూ. 15 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నగదు కాజేసి.. బెట్టింగ్ అప్లికేషన్‌లో జమ చేసి..

- సైబర్ ముఠాకు సహకరిస్తున్న ముగ్గురి అరెస్ట్
- లోన్ ఇస్తామని అమాయకులను దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లు
- కాజేసిన నగదును బెట్టింగ్ అప్లికేషన్ వాలెట్‌లోకి జమ
- నగదు బదిలీకి సహకరిస్తున్న బెట్టింగ్ అప్లికేషన్ ఫ్రాంచైజీ గ్యాంగ్

విశాఖ సిటీ: నిషేధిత బెట్టింగ్ అప్లికేషన్ నిర్వహిస్తూ.. నకిలీ లోన్ నిర్వాహక ముఠాకు సహాయం చేస్తున్న మోసగాళ్లకు సైబర్ క్రైం పోలీసులు చెక్ పెట్టారు. బెట్టింగ్ అప్లికేషన్ ఫ్రాంచైజీ తీసుకున్న వ్యక్తితో పాటు అతని సహాయకులిద్దరిని శనివారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన శరగడం మోహనరావు అనే వ్యక్తి తన వ్యక్తిగత అవసరాల కోసం రుణం తీసుకోడానికి ఆన్‌లైన్‌లో పలు అప్లికేషన్లను పరిశీలించాడు. ఇందులో ఇండియన్ బుల్స్ అనే అప్లికేషన్‌లో తన వ్యక్తిగత వివరాలు, మొబైల్ నంబర్‌ను నమోదు చేశాడు. కొద్దిసేపటికే నకిలీ లోన్ కంపెనీ అయిన ఇండియన్ బుల్స్ ప్రతినిధుల నుంచి మోహనరావుకు కాల్ వచ్చింది. లోన్ ఇస్తామని చెప్పి నమ్మించారు. అయితే డాక్యుమెంటేషన్, ఎన్‌వోసీ, జీఎస్టీ చార్జీల పేరుతో కొంత నగదు జమ చేయాలని చెప్పారు. వారి మాటలు నమ్మిన మోహనరావు దఫదఫాలుగా రూ.3.42 లక్షలు నేరగాళ్లు చెప్పిన ఖాతాలోకి జమ చేశాడు. అయినప్పటికీ తనకు లోన్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించి వెంటనే సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి సాంకతికత సహాయంతో దర్యాప్తు చేపట్టగా.. విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి కాజేసిన నగదును దేశంలో నిషేధించిన దుబాయ్‌కు చెందిన స్పింటర్ ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ అప్లికేషన్ ఖాతాలోకి బదిలీ చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వాస్తవానికి ఈ బెట్టింగ్ అప్లికేషన్ వాలెట్‌లోకి నగదు జమ చేయాలంటే.. ఆ బెట్టింగ్ అప్లికేషన్‌ను ఫ్రాంచైజీ తీసుకున్న వారి సహాయం అవసరం. ఈ కోణంలో దర్యాప్తు చేయగా విజయవాడకు చెందిన పాటి శివ పాండురంగారావు బెట్టింగ్ ఫ్రాంచైజీని కలిగి ఉన్నట్లు తెలుసుకున్నారు. అతను సైబర్ నేరగాళ్లతో సంప్రదింపులు జరిపి.. బాధితుల నుంచి కాజేసిన నగదును బెట్టింగ్ అప్లికేషన్ వాలెట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాడు. ఆ తర్వాత ఆ నగదును నేరగాళ్ల గేమింగ్ వాలెట్ ఐడీలోకి జమ చేస్తున్నాడు. అనంతరం నేరగాళ్లు విత్‌డ్రా రిక్వెస్ట్ పెట్టుకుని.. వారికి కావాల్సిన ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. పాండురంగారావు ఈ బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహించడం కోసం డబ్బులు అవసరమున్న రకరకాల వ్యక్తులను సంప్రదిస్తున్నాడు. వారితో ఖాతా ఓపెన్ చేయించి.. వారికి కొంత నగదు ఇచ్చి వారి పేర్ల మీద అకౌంట్లు నిర్వహిస్తూ బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. నేరగాళ్ల వివిధ వ్యక్తుల నుంచి సేకరించిన 6 మ్యూల్ ఖాతాలు పరిశీలించగా సుమారు రూ.20కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇందులో కమిషన్ రూపంలో నిందితులకు రూ.80 లక్షల వరకు గత ఏడాదిన్నర కాలంలో వచ్చినట్లు ఆధారాలు సేకరించారు.

రుషికొండలో ముగ్గురు అరెస్ట్

బెట్టింగ్ అప్లికేషన్ ఫ్రాంచైజీ తీసుకున్న విజయవాడకు చెందిన పాటి శివపాండురంగారావు, అతనికి సహాయకులుగా పనిచేస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన ఈరె గోవిందకుమార్, బాపట్ల జిల్లా రేపల్లె మండలానికి చెందిన పట్టంశెట్టి వెంకట సాయి మణికంతను సైబర్ క్రైం పోలీసులు రుషికొండ వద్ద ఓ హోటల్‌లో అరెస్ట్ చేశారు. వారి నుంచి బెట్టింగ్ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్న 9 సెల్ ఫోన్లు, 2 ల్యాప్ టాప్‌లు, రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు.

మళ్లీ తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

- దట్టంగా పొగమంచు
- ఉధృతంగా చలిగాలులు

సాక్షి,పాడేరు: ఇటీవల తుపాను ప్రభావంతో తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు శనివారం నుంచి మళ్లీ తగ్గుముఖం పడుతున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. చలిగాలులు ఉధృతంగా వీస్తున్నాయి, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 15 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 15డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 15.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.సాయంత్రం 4గంటల నుంచే చలిగాలులు ప్రారంభమయ్యాయి.



పొగమంచులో వాహనచోదకులు